క్లుప్తంగా

నేడు కొరువాడలో జగనన్న ఆరోగ్య సురక్ష

కె.కోటపాడు: కొరువాడలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.శచీదేవి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేస్తారన్నారు. ఇప్పటికే వలంటీర్లు ద్వారా ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించినట్లు తెలిపారు. వారంతా వైద్య సేవలు పొందాలని సూచించారు.

అలరించిన చిన్నారుల కోలాటం


కోలాట గురువు సీతమ్మను సన్మానిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: విజయ దశమి ఉత్సవాల్లో భాగంగా కోలాటం గురువు చక్రవర్తుల సీతమ్మను సోమవారం రాత్రి మాడుగులలో ఘనంగా సన్మానించారు. కొన్నేళ్లుగా ఈమె చిన్నారులకు కోలాటం నేర్పుతోంది. గ్రామానికి చెందిన సీతమ్మ వృద్ధాప్యంలోనూ కోలాటం ఉచితంగా నేర్పించి ఆదర్శంగా నిలుస్తోందని దసరా ఉత్సవ కమిటీ చైర్మన్, ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు తెలిపారు. ఆమెను సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. చిన్నారులతోపాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకగా కుంతీదేవి పండగ

నాతవరం: కుంతీదేవి అమ్మవారు పండగ నాతవరం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. కుంతీదేవి అమ్మవారిని ఏటా స్థానిక ఎస్సీ కాలనీ నుంచి ఊరేగింపుగా తీసుకురావడం ఆనవాయితీగా వస్తోంది. ఇదే సంప్రదాయ ప్రకారం వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు చెక్కా జోగిరాజు, ఎంపీటీసీ ప్రభావతి, గ్రామ పెద్ద మూర్తి నారాయణమూర్తిల ఆధ్వర్యంలో సోమవారం కుంతీదేవిని కాలనీ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తుల ఆరాధ్య దైవంగా పూజించే అమ్మవారిని డప్పు వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా పొల్లాలోకి తీసుకెళ్లి అక్కడ వరి దుబ్బు తీసుకువచ్చి రామాలయంలో ఏర్పాటు చేశారు. రామాలయంలో సంక్రాంతి పండగ ముగిసేంత వరకు పలు దైవ సంకల్ప కార్యక్రమాలు చేస్తుంటారు. ఈ విధంగా చేయడం వల్ల పాడిపంటలతో గ్రామ సుభిక్షంగా ఉంటుందని గ్రామస్తుల నమ్మకం. కార్యక్రమంలో నాతవరం ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుక, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, మాజీ ఉప సర్పంచ్ లంక రాంబాబు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బస్సు యాత్రపై సమావేశం నేడు

మాడుగుల: నియోజకవర్గంలో వచ్చే నెల 2న జరగనున్న బస్సు యాత్రకు సంబంధించి చర్చించేందుకు స్థానిక శ్రీనివాస గెస్ట్ హౌస్ వద్ద బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు జరగనున్న కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. మండలంలో పార్టీ శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు, గృహసారథులు, వలంటీర్లు విధిగా హాజరు కావాలని కోరారు.

క్రీడలతో ఆరోగ్యం


టేబుల్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేత క్రీడాకారులతో కాండ్రేగుల విష్ణుమూర్తి

అనకాపల్లిటౌన్: క్రీడల ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా టేబుల్ టెన్నిస్ చైర్మన్ కాండ్రేగుల విష్ణుమూర్తి తెలిపారు. రాష్ట్రస్థాయి టెబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లాక్రీడాకారుల ద్వితీయ స్థానం సాధించినందుకు స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో మంగళవారం వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 16వ తేదీవరకూ అనంతపురం జిల్లాలో జరిగిన పోటీల్లో జిల్లా క్రీడాకారులు ద్వితీయస్థానం సాధించడం శుభపరిణామమన్నారు. క్రీడల్లో అంతర్‌జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన క్రీడాకారులకు జగనన్న క్రీడాక్లబ్‌లద్వారా పోత్సాహం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.రామకృష్ణ, కార్యదర్శి యల్లపు శ్రీనివాసరావు, కోశాధికారి దాడి బుజ్జి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


మాడుగుల: దేవీతల్లిని దర్శించుకుంటున్న డెయిరీ చైర్మన్ ఆనందరావు తదితరులు


కె.కోటపాడు: ఆర్లిలో 108 కలశాలతో పూజలు చేస్తున్న భక్తులు


బుచ్చెయ్యపేట: దుర్గమ్మ గుడిలో పూజలు చేస్తున్న భక్తులు


మాడుగుల రూరల్: ఎం. కోడూరు శివాలయం వద్ద జమ్మి వృక్షానికి పూజలు చేస్తున్న భక్తులు

జగన్మాతకు జేజేలు

- రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ
- భక్తులతో ఆలయాల కిటికిట
- జమ్మి వృక్షానికి పూజలు
- ఆకట్టుకున్న శక్తి వేషాలు, సాంస్కృతిక ప్రదర్శనలు

దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. గ్రామగ్రామాన భక్తిశ్రద్ధలతో, నియమ నిష్ఠలతో ఆనందోత్సాహాలతో సోమ, మంగళవారాలు ఈ వేడుక నిర్వహించారు. ఆయుధ, వాహన పూజలతో ఆలయాల వద్ద సందడి నెలకొంది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


మాకవరపాలెం: దుర్గామల్లేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

మాడుగుల: అలనాటి సంప్రదాయాల ప్రకారం దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేల వేషాలు, పౌరాణిక నాటకం సత్యహరిచంద్ర, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, ఉత్సవ కమిటీ చైర్మన్ దేవరాపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, మోద కొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రాజుల కాలంలో ఆయుధాలకు పూజలు

జైపూర్ సంస్థానాధీశులు యుద్ధంలో వాడిన ఆయుధాలను తహసీల్దారు కార్యాలయంలోని ప్రత్యేక గదిలో భద్రపరుస్తుంటారు. దసరా సందర్భంగా వీటిని బయటకు తీసి శుభ్రపరిచి ఆనాటి సంప్రదాయం ప్రకారం దేవీ ఆలయంలో ఆయుధ పూజ చేశారు.

దేవీతల్లి ఊరేగింపు

భారీ విద్యుత్ లైటింగ్, నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ దేవీతల్లిని ఊరేగించారు. ఈ కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందారు.

రావికమతం: కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు సోమవారం మహిషాసుర మర్దనిగానూ, మంగళవారం రాజరాజేశ్వరి దేవిగానూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు వేపా రామకృష్ణ కిశోర్ మంగళవారం తెల్లవారుజాము రెండు గంటల నుంచి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దర్శించుకున్నారు. నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. నవరాత్రుల దీక్షలు చేసిన మాలధారణ భక్తులు ప్రత్యేక వాహనాలపై విజయవాడ అమ్మవారి దర్శనానికి బయలుదేరి వెళ్లారు.


కె.కోటపాడు: గుల్లేపల్లిలో భవానీ మాలాధారుల పూజలు

మాడుగుల రూరల్: దసరా ఉత్సవాల సందర్భంగా ఎం. కోడూరులో పార్వతీ దేవికి, ఇక్కడ శివాలయం ఆవరణలో జమ్మి చెట్టుకు భవానీమాలధారులు, భక్తులు పూజలు చేశారు. కె.జె.పురం కళావేదిక మీద ఏర్పాటు చేసిన దుర్గామాతకు పూజలు నిర్వహించారు. అమ్మవారిని భవానీమాలధారులు దర్శించుకున్నారు. గ్రామంలో ఘటాలు ఊరేగించారు. జి. అగ్రహారం, ఎం. కోటపాడు, ఒమ్మలి, వీరవల్లి అగ్రహారం, పోతనపూడి అగ్రహారం గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మంగళవారం ఆయుధాలకు, వాహనాలకు పూజలు చేశారు. వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

చీడికాడ మండలంలో..

అప్పలరాజుపురంలో అతి పురాతన లలితాదేవి ఆలయంలో సోమవారం ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద వాహనాలకు పూజలు చేశారు. ఎంపీపీ కురచా జయమ్మ, నారాయణ మూర్తి, సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు దంపతులు దర్శించుకున్నారు. చీడికాడ, మాడుగుల, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు. చీడికాడలో సోమవారం రాత్రి దుర్గాదేవి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. బి. సింగవరం, బైలపూడి, తదితర గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

కె.కోటపాడు: ఆర్లిలో పైడిమాంబ ఆటో యూనియన్ సభ్యులు సోమవారం రాత్రి భవానీ అంబలం పూజ చేశారు. 108 కలశాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కె.కోటపాడు, గుల్లేపల్లి, తదితర గ్రామాల్లో దేవీ మండపాల వద్ద విజయదశమి పర్వదినం సందర్భంగా కుంకుమ పూజలు చేశారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో భవానీమాలధారులు దీక్షలు విరమించడానికి సీతయ్యపేట, నర్సీపట్నం, విజయవాడ తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలకు బయలుదేరి వెళ్లారు. సోమ, మంగళవారాలు దుర్గామ్మను ఆయా గ్రామాల్లో ఊరేగించారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు దాండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ పాల్గొన్నారు.

మాకవరపాలెం: విజయదశమి సందర్భంగా దుర్గాదేవి ఆలయాలు కిటకిటలాడాయి. మంగళవారం ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. మాకవరపాలెం దుర్గామల్లేశ్వర ఆలయంతోపాటు తామరం జంక్షన్‌లో దుర్గాదేవి ఆలయాల్లో భక్తుల తాకిడి నెలకొంది.

నాతవరం: మండలంలో విజయ దశమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శక్తి పంచాయతన ఆలయ సముహం ప్రాంగణంలో తెల్లవారు నుంచే భక్తులు సందడి నెలకొంది, నర్సీపట్నం – తుని ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఎ.శరభవరం దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. జిల్లేడుపూడి, ఎం.బి.పట్నం, పి.జగ్గంపేట, గుమ్మడిగొండ, వెదురుపల్లి, సిద్ధపట్నం, వల్సంపేట, గన్నవరం. వి.బి.అగ్రహారం గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో దసరా వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు.


మాడుగుల: ఆకట్టుకున్న శక్తి వేషాలు

రోలుగుంట: గ్రామాల్లో భవానీమాలధారులు నిష్ఠతో పూజలు చేశారు. మంగళవారం విజయ దశమి సందర్భంగా ఆయా గ్రామాల్లో దుర్గమ్మను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కొంతలంలో 101 కలశాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు.

దేవరాపల్లి: విజయదశమి పర్వదినం సందర్భంగా సోమ, మంగళవారాలలో ప్రజలు వాహనాలకు, యంత్రాలకు పూజలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొల్పిన అమ్మవారి మండపాల వద్ద పూజలు చేశారు. భవానీ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

మాడుగుల రూరల్: విజయ దశమి సందర్భంగా కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆఖరి రోజు మంగళవారం జమ్మి వృక్షానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ రాపేట రామ కొండలరావు ఆధ్వర్యంలో అష్టలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాడుగుల రూరల్: అప్పలరాజుపురం లలితాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


దేవరాపల్లిలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు


మాడుగుల రూరల్: జి. అగ్రహారంలో దురాదేవికి పూజలు చేస్తున్న ఎంపీటీసీ మాధవి దంపతులు


మాడుగుల రూరల్: కె.జె.పురంలో భవానీ భక్తుల పూజలు


కె.జె.పురంలో జమ్మి వృక్షం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


రావికమతం: కొత్తకోటలో రాజరాజేశ్వరి దేవిగా పూజలందుకుంటున్న అమ్మవారు


రోలుగుంట: కొంతలంలో 101 కలశాలతో అమ్మవారికి జలాభిషేకం

శివపార్వతి విగ్రహాల స్థాపనకు భూమి పూజ


శివపార్వతుల విగ్రహాల నిర్మాణ శంకుస్థాపనలో నాయకులు


దాత అప్పారావు దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట: కొమళ్లపూడిలో కొత్తగా శివపార్వతుల విగ్రహాల నిర్మాణానికి గ్రామపెద్దలు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఇక్కడ పెద చెరువు మధ్యలో కోటి రూపాయలతో విగ్రహాలతో పాటు పర్యాటకంగా తీర్చిదిద్దడానికి పార్కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి చెరువు గట్టు మీదకు సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గ్రామ పురవీధుల్లో పూర్ణకుంభంతో బాజాభజంత్రీలు, మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి విగ్రహాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. శివపార్వతి, శివలింగాల విగ్రహాల స్థాపనకు వ్యాపారి బుదిరెడ్డి దేముడుబాబు ముందుకొచ్చారు. రూ.20 లక్షలు అందించిన అప్పారావు దంపతులను విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచ్ గేదెల వెంకుయమ్మ, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షులు కె. అచ్చింనాయుడు, కె. జగ్గారావు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరినాగేశ్వరరావు, వడ్డాది కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

కమనీయం .. కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు శ్రీకాంత్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోలుగుంట ఎస్సైగా సురేష్


ఎస్సై సురేష్

రోలుగుంట: స్థానిక ఎస్సైగా సురేష్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ రెండున్నరేళ్లుగా పని చేసిన ఎస్సై బి.నాగకార్తీక్ అనకాపల్లి డి.సి.ఆర్.బి.కి బదిలీ అయ్యారు. అతని స్థానంలో సబ్బవరం ఎస్సై సురేష్‌ను ఇక్కడకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఈ మేరకు ఆయన సోమవారం మధ్యాహ్నం స్టేషన్‌కు వచ్చి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యమిస్తానన్నారు. ఈ ప్రాంతంలో గంజాయి రవాణాను అరికట్టేందుకు గాను కొత్తకోట సీఐ సూచనలు, ఆదేశాలు పాటించి, సిబ్బంది సహకారం తీసుకుంటానన్నారు. షెడ్యూల్ ప్రకారం మండలంలో గ్రామాలన్నీ పర్యటించి ప్రజాప్రతినిధులతో స్థానిక సమస్యలపై చర్చించి, వారి సహకారం తీసుకుంటానన్నారు.

దుర్గాదేవికి ఎమ్మెల్యే గణేష్ ప్రత్యేక పూజలు


దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


కుంకుమార్చన పూజలో పాల్గొన్న భక్తులు

నర్సీపట్నం: దసరా పండగను ప్రజలంతా ఘనంగా జరుపుకుంటున్నారు. నర్సీపట్నం శారదానగర్, బలిఘట్టం దుర్గాదేవి ఆలయాల్లో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. విజయదశమిని పురస్కరించుకుని అమ్మవారిని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వీక్షించారు. ఆయన వెంట పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, కర్రి చైతన్య, పార్టీ నాయకులు ఉన్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించుకున్నారు. దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు.

షిర్డీసాయి మందిరంలో ప్రత్యేక పూజలు


మాడుగుల షిర్డీసాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: స్థానిక గెడ్డబడి సమీపంలో షిర్డీసాయి మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం షిర్డీసాయి సమాధి దిగిన రోజు కావడంతో స్వామివారి మందిరానికి వేకువ జాము నుంచి భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.